రేపు బోడుప్పల్‌లో 5కే రన్‌

బోడుప్పల్‌: బోడుప్పల్‌ నగర పాలక సంస్థ పరిధిలో ఈనెల 29న సిమ్‌లైన్‌ ఫిట్‌నెస్‌ ఆధ్వర్యంలో ఉదయం 5.30 గంటల నుంచి లక్ష్మీనగర్‌ (హుడా) పార్కు వద్ద నుంచి 5కె, 3కె, 2కె రన్‌ నిర్వహిస్తున్నట్లు ఆసంస్థ ఎండీ జయసింహగౌడ్‌ వెల్లడించారు. గురువారం బోడుప్పల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. సైబర్‌ క్రైమ్‌ అవేర్‌నెస్‌ కార్యక్రమంలో భాగంగా రన్‌ ఫర్‌ ఫిట్‌నెస్‌ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్‌ కోసం 9391971537 నెంబరుకు ఫోన్‌ చేయాలన్నారు.

పవర్‌ బోరుకు మరమ్మతులు



గౌతంనగర్‌: గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని అన్ని కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని బీఆర్‌ఎస్‌ నాయకులు మేకల రాముయాదవ్‌ అన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని ఇందిరానెహ్రూ నగర్‌ మూడు కమాన్ల వద్ద పాడైపోయిన పవర్‌ బోరు మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్‌ను ఉపయోగించుకోండి

బోడుప్పల్‌: బోడుప్పల్‌ నగర పాలక సంస్థ పరిధిలోని 2024–25 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిదారులు వడ్డీపై 90 శాతం మాఫీ (వన్‌టైం సెటిల్‌మెంట్‌) స్కీమ్‌ను ఉపయోగించుకోవాలని బోడుప్పల్‌ కమిషనర్‌ శైలజ కోరారు. బోడుప్పల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఆస్తి పన్ను పూర్తిగా చెల్లించే వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈనెల 31వ తేదీ వరకు మాత్రమే అవకాశముందన్నారు. అత్యధికంగా పన్ను బకాయిదారులు దేవేందర్‌నగర్‌, అంబేద్కర్‌నగర్‌, ఇందిరానగర్‌, ఎస్సీ బస్తీ, రాజీవ్‌నగర్‌, యాదవ్‌నగర్‌ బస్తీ వాసులున్నారన్నారు.

మున్నూరు కాపు సంక్షేమం కోసం పని చేయాలి



సర్టిఫికెట్‌ను అందుకుంటున్న రాజబాబు

మల్లాపూర్‌: మున్నూరు కాపు సంక్షేమా కోసం పని చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షులు పిల్లి శ్రీనివాసరావు సూచించారు. గురువారం నాచారం మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు తిప్పిరి రాజబాబు, కార్యవర్గానికి అధికారిక అనుబంధ సంఘం గుర్తింపు సర్టిఫికెట్‌ను అందజేశారు. మున్నూరు కాపు మహాసభ ప్రధాన కార్యదర్శి నగేష్‌,మహిళా అధ్యక్షురాలు చామకూర సుజాత, సికిం ద్రాబాద్‌ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు చేకూరి వెంకటేశ్వర్‌ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాలో పారిశుద్ధ్య పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌

మల్లాపూర్‌: రంజాన్‌ పండుగ సందర్భంగా నాచారం ఎర్రకుంట ఈద్గాలో గురువారం పారిశుద్ధ్య కార్మికులు పిచ్చిమొక్కలను, తొలగించే పనులను చేపట్టారు. ఈ పనులను నాచారం కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌ శేఖర్‌ పర్యవేక్షించారు. అనంతరం కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఎర్రకుంట ఈద్గాలో 2 వేల మంది రంజాన్‌ రోజు ప్రార్థనలు చేయడానికి రానున్న సందర్భంగా ఈద్గాలో పారిశుద్ధ్య పనులు చేపట్టామన్నారు. ఎస్‌ఎఫ్‌ ఏ నరేష్‌, స్థానికులు దాసరి కర్ణ,మంగోల్‌ శివకుమార్‌, కట్ట బుచ్చన్న గౌడ్‌, వాసు తదితరులున్నారు.

హోటళ్లలో అధికారుల తనిఖీలు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లను మున్సిపల్‌ కమిషనర్‌ నాగమణి తమ సిబ్బందితో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో కుళ్లిన ఆహారం, వంటసరుకులు, కూరగాయాలు, కుళ్లిన మాంసం లేబుల్‌లేని వస్తువులు, గోధుమపిండి, మైదా వంటి వాటిల్లో పురుగులు అపరిశుభ్రంగా ఉండే వంట గదులను గుర్తించారు. షోకాజ్‌ నోటీసులు జారీచేసి, సదరు దాబాకు రూ 4 వేల జరిమానా, కబాబ్‌ హోటల్‌ పరిశుభ్రత పాటించని కారణంగా రూ. 1000 జరిమానా విధించారు.

అర్హులకు తప్పని తిప్పలు !

రేషన్‌ కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న పేదలు



సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని ఉప్పల్‌ ప్రాంతంలో అద్దెకుంటున్న శైలజ కుటుంబానికి ఇప్పటి వరకు రేషన్‌కార్డు జారీచేయలేదు. పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా.. కూడా రాలేదు. కార్డు లేకపోవడంతో గృహజ్యోతితో సహా పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇతర పథకాలు అందడం లేదు. ఆమె కుటుంబానికే కాదు నగరంతో సహా శివారుల్లోని వందలాది నిరుపేద కుటుంబాలకు తెల్లరేషన్‌ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను నోచుకోని పరిస్థితి నెలకొంది. సంక్షేమ పథకాలు పొందాలంటే ఆహార భద్రత కార్డు (తెల్ల రేషన్‌ కార్డు)ను ప్రభుత్వం ప్రామాణికం చేసింది. అన్ని అర్హతలున్నా.. కార్డులేని పేదలకు ప్రభుత్వ పథకాలు పొందటం ఇబ్బందిగా మారుతోంది. ఇటీవల కొత్త రేషన్‌ కార్డుల జారీకి దరఖాస్తులు ఆహ్వానించినా... ప్రభుత్వం జాప్యం చేస్తోంది. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

167 మాత్రమే పంపిణీ..

గృహజ్యోతి, రూ.500 సిలిండర్‌, తాజాగా ప్రవేశపెట్టిన రాజీవ్‌ యువ వికాస్‌ పథకానికి తెల్లరేషన్‌ కార్డు తప్పనిసరి కావడంతో అర్హులు ఇబ్బందిపడాల్సి వస్తోంది. కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే గ్రామ సభలు నిర్వహించి రేషన్‌ కార్డుల కోసం దరఖాస్తులు తీసుకుంది. తాజాగా మీ–సేవా కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. కానీ జనవరిలో ఎంపిక చేసిన గ్రామాల్లో 167 కొత్త కార్డులను మాత్రమే పంపిణీ చేయడం గమనార్హం.

క్షేత్రస్థాయిలో విచారణ..

నగర శివారుల్లో కొత్త కార్డులు, సభ్యుల పేర్ల నమోదు దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో మరోసారి విచారణ చేపట్టనున్నారు. మండల స్థాయిలో ఆర్‌ఐలు తన లాగిన్‌ వచ్చినవి మాత్రమే పరిశీలించనున్నారు. ఆ తర్వాత వాటిని విచారించి అర్హులను ఎంపిక చేయనున్నారు. దీనికి సంబంధించి మౌఖిక ఆదేశాలు వచ్చాయని పౌర సరఫరాల అధికార వర్గాలు చెబుతున్నాయి.

- మేడ్చల్‌ జిల్లాలో మొత్తం రేషన్‌ కార్డులు : 5,23,938
- కొత్తగా వచ్చిన దరఖాస్తులు : 72,864
- కార్డుల్లో సభ్యుల పేర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తులు: 85,885

పెండింగ్‌లో 86,885 దరఖాస్తులు..

నగరంతో పాటు శివారులోని 29 పురపాలక సంఘాల్లో కొత్త రేషన్‌కార్డు ఊసేలేదు. ప్రస్తుతం ఉన్న కార్డుల్లో కూడా కుటుంబసభ్యుల పేర్లు చేర్పించేందుకు 86,885 దరఖాస్తులను మీ–సేవా కేంద్రాల ద్వారా తీసుకోగా.. అవి కూడా పెండింగ్‌లోనే పెట్టారు.

ఏమిటీ నిర్లక్ష్యం ?

'ఎలివేటెడ్‌ కారిడార్‌' పనుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్‌: ఉప్పల్‌ ఎలివేటెడ్‌ కారిడార్‌ నిర్మాణ పనుల నిర్లక్ష్యంపై గురువారం ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అసెంబ్లీలో గళమెత్తారు. ఏళ్ల తరబడి నుంచి నారపల్లి నుంచి ఉప్పల్‌ వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్‌ కారిడార్‌ పనులు నత్తన నడకన నడుస్తున్నాయని ఫలితంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఆర్‌ అండ్‌ బి మంత్రి రెండు పర్యాయాలు వచ్చి వెళ్లినా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కారిడార్‌ నిర్మాణ పనులు వేగవంతగా పూర్తి చేయాలని కొరారు. అప్పటి వరకు ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు బీటీ రొడ్డు వేయాలని కొరారు. వీటితో పాటు ఉప్పల్‌ నియోజవర్గ పరిధిలో పెద్ద పెద్ద చెరువులున్నాయని వాటి బ్యూటిఫికేషన్‌ చేయాలని కోరారు. ఉప్పల్‌ నియోజక వర్గానికి చెందిన వందలాది మంది వరకు ప్రయాగ్‌ రాజ్‌ కుంభ్‌ మేళాకు వెల్లారని అందులో దాదాపుగా 15 మంది వరకు మృత్యు వాత పడ్డారని ప్రభుత్వం తరపున వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కోరారు.

ఉద్యోగాల కల్పనకు విద్యార్థులు శ్రమించాలి



టెక్‌ఫెస్ట్‌ సంచికను ఆవిష్కరిస్తున్న డాక్టర్‌ వెంకటరమణ

పోచారం: ఆధునిక సాంకేతిక యుగంలో ప్రపంచ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని రాష్ట్ర సాంకేతిక విద్యామండలి మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్‌ వెంకటరమణ పిలుపునిచ్చారు. నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాలలో గురువారం ప్రారంభమైన జాతీయస్థాయి టెక్‌ఫెస్ట్‌లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ.. ఉద్యోగాల కల్పన దిశగా విద్యార్థులు శ్రమించాలన్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా లక్ష్యం చేరే వరకు దృఢ సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. విశిష్ట అతిథిగా ఎమ్‌ఎస్‌ఎమ్‌ఈ మాజీ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ కే.సీ.చౌదరి హాజరై మాట్లాడారు. విద్యా సంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి మాట్లాడుతూ.. అందరికీ మార్గదర్శనం చేసేలా నాయకత్వ లక్షణాలను విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. అనంతరం టెక్‌ఫెస్ట్‌ సంచికను ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్‌ నల్ల దివ్య, కోశాధికారి స్నేహ, ప్రిన్సిపాల్‌ డా.ఎమ్‌ఎస్‌వీ రమేష్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ డా. రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



మల్లాపూర్‌: మల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని నెహ్రూనగర్‌ రెండవ బ్లాక్‌లో గత కొన్ని నెలలుగా భూగర్భ డ్రైనేజీలు పగిలిపోయి డ్రైనేజీ కాస్త రోడ్లపై పారుతుంది. దీంతో దుర్గంధం, దుర్వాసనం భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు జలమండలి మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వాసనతో బస్తీలో ఉన్న వారికి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

'రాజీవ్‌ యువ వికాస్‌' కు దరఖాస్తు చేసుకోవాలి

శామీర్‌పేట్‌: రాజీవ్‌ యువవికాస్‌ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మూడుచింతలపల్లి ఎంపీడీఓ గీతారెడ్డి అన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఈబీసీ, ఈడబ్ల్యూఎస్‌, కమ్యూనిటీకి చెందిన వారై ఉండాలని, వ్యవసాయేతర పథకాలకు (21), నుంచి 55 ఏళ్ల లోపు ఉండాలన్నారు, వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలకు 21 నుంచి 60 ఏళ్లలోపు ఉండి గ్రామీణ ప్రాంతాలవారికి రూ.1.50లక్షలకు లోబడి వార్షిక ఆదాయానికి లోబడి ఉన్నవారే, ఈ పథకం కింద అర్హులైనవారని తెలిపారు. ఈ పథకానికి మీ సేవ కేంద్రంలో ఏప్రిల్‌ 5లోపు రిజిస్ట్రేషన్‌ చేసుకుని, ఒరిజినల్‌ దరఖాస్తును ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

50 రోజులకు చేరుకున్న ఉత్తరాల ఉద్యమం

ఘట్‌కేసర్‌: పట్టణంలోని గురుకుల్‌కు పూర్వవైభవం తీసుకురావాలని పూర్వ విద్యార్థులు సీఎం రేవంత్‌ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పంపే ఉత్తరాల ఉద్యమం గురువారంతో 50 రోజులకు చేరుకుంది. గురుకుల్‌ను అభివృద్ధి చేయాలని కోరుతూ పోస్టాఫీస్‌ లేఖలో పోస్ట్‌ చేశారు. మాజీ సర్పంచ్‌ యాదగిరియాదవ్‌, పాండురంగస్‌, బాలకృష్ణ, వెంకటేష్‌, ప్రేమ్‌కుమార్‌, మహిపాల్‌రెడ్డి, రవీందర్‌, సబితా, సిరాజ్‌గుప్తా, నగేష్‌, లక్ష్మణ్‌, సిరాజ్‌, రాంచందర్‌యాదవ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, సురేష్‌, లక్ష్మణ్‌, జగదీష్‌, అక్బర్‌ పాల్గొన్నారు.



కేన్సర్‌పై అవగాహన



మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్‌ పీటర్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ×ఆటిజం, క్యాన్సర్‌ అవగాహన మరియు నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్‌ నబత్‌ లఖానీ, శ్యామా లఖానీ విద్యార్థులకు కేన్సర్‌, ఆటిజం గురించి వివరించారు. కళాశాల కార్యదర్శి టీవీ. రెడ్డి, డైరెక్టర్‌ సరోజారెడ్డి, ప్రిన్సిపాల్‌ చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ పీవో ఆసం రాజేష్‌ పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు దేవాదాయశాఖ పర్యవేక్షణాధికారి వెంకన్న సమక్షంలో జరిగింది. 43 రోజుల్లో రూ 2,42,430 ఆదాయం వచ్చిందని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, తులసి రమణాచార్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులు సానాది శంకర్‌, హేమంత్‌కుమార్‌, రవీందర్‌రెడ్డి,పద్మావతిగౌడ్‌, అనితాయాదవ్‌, కన్నా, రవీందర్‌ పాల్గొన్నారు.

రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బూమ్‌రెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌, రెడ్డికాలనీ సంక్షేమసంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఘనంగ జరిగింది. అధ్యక్షుడుగా బూమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చెప్యాల వెంకట్రాంరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి సహకారంతో కాలనీ అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామన్నారు. కాలనీ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం లభించేలా చూస్తామన్నారు. ఉపాధ్యక్షుడిగా బి. సుదర్శన్‌, కోశాధికారిగా వి. జీవన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎ. వెల్మారెడ్డి బాధ్యతలు స్వీకరించగా చెప్యాల సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నర్సిరెడ్డి, కృష్ణారెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పండుగను ఘనంగా నిర్వహించాలి

ఘట్‌కేసర్‌: బొడ్రాయి పండుగపై పట్టణంలోని మున్సిపల్‌ కార్యాలయం సమీపంలో గురువారం పట్టణ పెద్దలు, వివిధ కులసంఘాల ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మే నెల 15న ఊరేగింపు, 16, 17, 18న బొడ్రాయి పండుగ ఘనంగా నిర్వహించాలని తీర్మానం చేశారు. శ్రీనివాస్‌గౌడ్‌, జంగయ్యయాదవ్‌, ముత్యాలు, అంజిరెడ్డి, యాదగిరి, ఆంజనేయులు, దాసు, బాలయ్య, నారాయణ, బిక్షపతి, నాగేష్‌, సత్యనారాయణ, మల్లేష్‌ తదితరులున్నారు.

ఆస్తిపన్ను చెల్లించి రాయితీ పొందండి

శామీర్‌పేట్‌: ఆస్తిపన్నుపై రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్‌ వెంకటగోపాల్‌ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ జీవో ఎంఎస్‌ నెంబర్‌ 154 తేదీ: 25.03.2025 ద్వారా ఆస్తిపన్ను బకాయి వడ్డీని 90 శాతం మాఫీతో పాటు 10 శాతం వడ్డీతో మాత్రమే చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కమిషనర్‌ వివరించారు. ఈ నెల 31లోగా పన్ను చెల్లించాలని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్‌ పరిధిలోని ఈశ్వర్‌ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్‌ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని గురువారం కాంగ్రెస్‌ నేత, కాలనీ అసోసియేషన్‌ అధ్యక్షుడు సోమేష్‌, ఉపాధ్యక్షుడు రవిబాబులు దమ్మాయిగూడ మున్సిపల్‌ కమిషనర్‌ నాగమణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు, కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మున్సిపల్‌ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పాస్టర్‌ ప్రవీణ్‌ మృతిపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి: పాస్టర్‌ ప్రవీణ్‌ పగడాల మృతి పట్ల నిపక్షపాతంగా ఏపీ ప్రభుత్వం దర్యాప్తు చేయాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. గురువారం సికింద్రాబాద్‌ సెంచనరీ బాప్టిస్ట్‌ చర్చ్‌లో ప్రవీణ్‌ భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. మూడు రోజులవుతున్నా దర్యాప్తు పై ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగాలేదన్నారు. ఈ సంఘటన పై ఖచ్చితంగా అనుమానాలు ఉన్నాయని దోషులు ఎంతటివారైనా తగిన చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడి దృష్టికి తీసుకెళ్లి ఏపీ ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొని వస్తామన్నారు. నివాళులు అర్పించిన వారిలో కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌, గుండా నిరంజన్‌, సంజీవరావు,బాబు,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



ఆర్టీసీ రీజనల్‌ మేనేజర్‌కు వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్లు

అల్వాల్‌: అల్వాల్‌ సర్కిల్‌ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబిత అనిల్‌కిషోర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు ఆర్టీసీ రీజనల్‌ మేనేజర్‌ పవిత్రని కలిసి వినతిపత్రం అందచేశారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా ఆర్టీసీ సేవలను మెరుగుపర్చాలని, అవసరమైన చోట ఆర్టీసీ కొత్త బస్సు రూట్లను ప్రారంభించాలని, నిలిపివేసిన ఆర్టీసీ బస్సు రూట్లను పునరుద్ధరించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకులు డోలి రమేష్‌, అనిల్‌కిషోర్‌, రాముయాదవ్‌, యాదగిరిగౌడ్‌, భాగ్యనందరావు, సాయిగౌడ్‌, శరణగిరి, రాజేష్‌, దినేష్‌ పాల్గొన్నారు.

ప్రతి నీటి చుక్కా జీవనాధారమే

ఉప్పల్‌: ఇళ్లు, అపార్ట్‌మెంట్ల వద్ద ఇంకుండు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని చిలుకానగర్‌ కార్పొరేటర్‌ బన్నాల గీత ప్రవీణ్‌ ముదిరాజ్‌ కోరారు.ప్రంపంచ వాటర్‌ డే ను పురస్కరించుకుని జలమండలి అధికారులతో కలిసి బ్యాంక్‌ కాలనీలోని జోషి విద్యానికేతన్‌ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అవగాహన ర్యాలీని నిర్వహించారు. సేవ్‌ వాటర్‌ సేవ్‌ లైఫ్‌ అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులు ముందుకు సాగారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్‌ ముదిరాజ్‌, జలమండలి జీఎం సంతోష్‌ కుమార్‌, కాలని ప్రతినిదులు పాల్గొన్నారు.



ఇంకుడు గుంతలకు మరమ్మత్తులు చేస్తున్న కార్పొరేటర్‌ గీత, ప్రవీణ్‌, విద్యార్థులు

ఆకట్టుకున్న సైన్స్‌ ఫేర్‌



సైన్స్‌ ఫైర్‌ను పరిశీలిస్తున్న శివరాత్రి యాదగిరి తదితరులు

ఉప్పల్‌: విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల మేదస్సును పెంచుతాయని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి అన్నారు. ఉప్పల్‌ చిలుకానగర్‌ రోడ్డు సర్‌మౌంట్‌ స్కూల్‌ లో నిర్వహించిన సైన్స్‌ ఫేర్‌కు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. సైన్స్‌ ఫేర్‌లో విద్యార్థుల ప్రదర్శనలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్‌ బాణాల విజేందర్‌ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్‌ కార్యదర్శి కె. రామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న మైనంపల్లి

మల్కాజిగిరి: రాష్ట్రంలో సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. గురువారం ఆనంద్‌బాగ్‌ క్యాంప్‌ కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జైబాపు జై భీమ్‌ జై సంవిధాన్‌ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మైనంపల్లి మాట్లాడుతూ గాంధీ, అంబేద్కర్‌ ఆశయాలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని గౌరవిస్తూ కాంగ్రెస్‌ పార్టీ ప్రజలకు సేవ చేస్తున్నదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి రాజ్యాంగం పైన గౌరవమే లేదన్నారు.కాంగ్రెస్‌ పార్టీ తోనే పేద,బడుగుబలహీన వర్గాల అభివృద్ధికి కృషి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫుడ్‌ కార్పొరేషన్‌ ఛైర్మన్‌ ఎంఎ ఫహీం, కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్‌, జితేంద్రనాథ్‌, పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



బొంతు శ్రీదేవిని కలిసిన నాగార్జున నగర్‌ కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు

కుషాయిగూడ: కాలనీ సమస్యలపై నాగర్జుననగర్‌ కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు గురువారం చర్లపల్లి కార్పొరేటర్‌, స్టాండింగ్‌ కమిటీ సభ్యురాలు బొంతు శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ, విద్యుత్‌ పోల్స్‌, వీధి దీపాల ఏర్పాటుతో పాటుగా అంతర్గత రోడ్లపై గుంతలకు మరమత్తులు చేపట్టాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్‌ అధికారులతో మాట్లాడి దశల వారిగా కాలనీ సమస్యలకు పరిష్కారం లభించేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ నాగిళ్ల బాల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు యావపురం రవి, ప్రధాన కార్యదర్శి మొగిలి కరుణాకర్‌రెడ్డి, గోపాల్‌యాదవ్‌, సాయివివేక్‌, శ్రీశైలం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌



ఘట్‌కేసర్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్‌: పట్టణంలోని జామామజీద్‌ వద్ద బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌ విందు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై మజీద్‌ అధ్యక్షుడు అన్వూ, ప్రధాన కార్యదర్శి నబితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్‌ విందు ప్రారంభించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. బీఆర్‌ఎస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌, మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌ రెడ్డి, మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ మాధవరెడ్డి, కౌన్సిలర్లు అనురాధా, రమాదేవి, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్‌, నర్సింగ్‌రావు, ఎఫ్‌ఎస్‌సీఎస్‌ డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, మాజీ చైర్మన్‌ శ్రీనివాస్‌గౌడ్‌, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, నవీన్‌ ప్రకాష్‌, జగన్‌ మోహన్‌రెడ్డి, యాదగిరి, ఖలీల్‌, అయూబ్‌, నజీర్‌, ఫిరోజ్‌, షకీల్‌, సలీం, కుతుబ్‌, జహంగీర్‌, ఫరూఖ్‌, సిరాజ్‌ పాల్గొన్నారు.

వడ్డీ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును డిప్యూటీ కమిషనర్‌కు అందచేస్తున్న రెవెన్యూ అధికారులు

అల్వాల్‌: వడ్డీ రాయితీ సదుపాయాన్ని ఆస్తి పన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని అల్వాల్‌ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం సర్కిల్‌ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అల్వాల్‌ సర్కిల్‌లోని వెంకటాపురం, మచ్చబొల్లారం, అల్వాల్‌ డివిజన్లలో రూ.36 కోట్ల ఆస్తి బకాయిలు ఉండగా ఇప్పటివరకు రూ.32 కోట్లు వసూలు చేశామని, రాబోయే మూడు రోజుల్లో పూర్తిగా వసూలు చేయగలమన్న ధీమా వ్యక్తం చేశారు. అల్వాల్‌ జీహెచ్‌ఎంసీ పరిధిలోని దక్కన్‌ క్రానికల్‌ బిల్డింగ్‌ వారి నుండి రూ.14 లక్షల చెక్కును గురువారం సర్కిల్‌ అధికారులకు అందచేశారు. ఆస్తి పన్ను అపరాధ రుసుము 90 శాతం రాయితీతో చెల్లించుటకు మూడు రోజులు ఉన్నందున ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని చెల్లింపుదారులను కోరారు. ఆన్‌లైన్‌ ద్వారా లేదా జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఆస్తి పన్ను చెల్లించవచ్చునన్నారు.